క్లుప్తంగా

నియామకం



డీసీసీ అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డిని సత్కరిస్తున్న కిషోర్

హుడాకాంప్లెక్స్: కాంగ్రెస్ పార్టీ రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షుడిగా సరూర్‌నగర్‌కు చెందిన గంగమ్ కిషోర్‌ను నియమిస్తూ జిల్లా అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. తనపై నమ్మకంతో పదవి ఇచ్చిన సీఎం రేవంత్‌రెడ్డి, చల్లా నర్సింహారెడ్డి పార్టీ పెద్దలకు ఈ సందర్భంగా కిషోర్ కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ బలోపేతానికి కృషి చేస్తానన్నారు. అనంతరం డీసీసీ అధ్యక్షుడు నర్సింహారెడ్డి మాట్లాడుతూ.. పనిచేసే నాయకులకు, కార్యకర్తలకు పార్టీ తగిన గుర్తింపు ఇస్తుందని చెప్పారు.

రంజిత్‌రెడ్డి గెలవాలని పూజలు



పూజలు చేసిన అనంతరం కార్పొరేటర్లు, నాయకులు

మీర్‌పేట: చేవెళ్ల కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి గడ్డం రంజిత్‌రెడ్డి విజయం సాధించాలని కోరుతూ మీర్‌పేట కార్పొరేషన్ 19వ డివిజన్ కార్పొరేటర్ బైగళ్ల బాలమణి ఆధ్వర్యంలో జిల్లెలగూడ వేంకటేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా బాలమణి మాట్లాడుతూ.. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అత్యధిక ఎంపీ స్థానాలను గెలుచుకుంటుందని, అదే విధంగా చేవెళ్లలో రంజిత్‌రెడ్డి భారీ మెజార్టీతో గెలుపొందడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు గజ్జెల రాంచందర్, అక్కి మాధవి, మీర్‌పేట అధ్యక్షులు సామిడి గోపాల్‌రెడ్డి, నాయకులు చల్లా బాల్‌రెడ్డి, సిద్దాల శ్రీశైలం, బైగళ్ల ఓంప్రకాశ్, రవిగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

డిప్యూటీ మేయర్‌కు మాతృవియోగం



ఇబ్రాం నర్సమ్మ

బడంగ్‌పేట్: బాలాపూర్‌కు చెందిన బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ ఇబ్రాం శేఖర్‌కు మాతృవియోగం జరిగింది.ఇబ్రాం నర్సమ్మ ఇంట్లోనే మృతి చెందారు. విషయం తెలుసుకున్న మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితారెడ్డి, మేయర్ చిగురింత పారిజాత, కమిషనర్ రఘు, కార్పొరేటర్లు, స్థానికులు,కార్పొరేషన్ సిబ్బంది,కుటుంబ సభ్యులు, పలువురు అధికా రులు బాలాపూర్‌కు చేరుకుని నివాళులు అర్పించారు. డిప్యూటీ మేయర్ ఇబ్రాం శేఖర్‌తోపాటు కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే సబితారెడ్డి ఓదార్చారు. బాలాపూర్‌లోని హిందూ స్మశానవాటికలో అంత్రక్రియలు నిర్వహించారు.

అమరవీరులకు నివాళి



కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

మీర్‌పేట: రాష్ట్ర ఆవిర్భావ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా మీర్‌పేట కార్పొరేషన్ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు అర్కల కామేశ్‌రెడ్డి ఆధ్వర్యంలో శనివారం రాత్రి జిల్లెలగూడ అంబేడ్కర్ విగ్రహం నుంచి చందన చెరువు కట్టపై గల అమరవీరుల స్థూపం వరకు బీఆర్ఎస్ నాయకులు కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా కామేశ్‌రెడ్డి మాట్లాడుతూ.. మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి ఆదేశాల మేరకు ర్యాలీ నిర్వహించి అమరవీరులకు నివాళులర్పించామన్నారు. కార్యక్రమంలో మేయర్ ఎం.దుర్గాదీప్‌లాల్ చౌహాన్, కార్పొరేటర్లు సిద్దాల లావణ్య, అనిల్‌యాదవ్, యాదగిరి ముదిరాజ్, తదితరులు పాల్గొన్నారు.

మూడు నెలలు అవుతున్నా జీతాలు ఇవ్వరా?

మొయినాబాద్‌రూరల్: హిమాయత్‌నగర్ గ్రామ పంచాయతీలో పని చేస్తున్న కార్మికులు శనివారం మూడునెలలు అవుతున్నా జీతాలు రావడం లేదని పంచాయతీ కార్యదర్శి సంధ్యారాణిని అడిగారు. ప్రతి రోజు రోడ్లు, మురికి కాల్వలు తీస్తున్నామని, ఎక్కడైనా చెత్త కనబడితే వెంటనే ఫోన్ చేసి అక్కడ చెత్త ఉంది, మురికి నీరు ఉంది అంటారు కానీ మా జీతాల గురించి మాట్లాడరని ఆవేదన వ్యక్తం చేశారు. అప్పులు చేసి తింటున్నామని, ఇప్పటికైనా మాకు జీతాలు వచ్చే విధంగా చూడాలని పంచాయతీ కార్యదర్శిని కోరారు. ప్రతి నెల వేతనాలు మీ అకౌంట్‌లోకే వస్తాయి. కానీ మూడునెలలుగా వేతనాలు రావడం లేదని తెలుస్తోంది. పై అధికారులకు తెలియజేస్తామన్నారు.

సింగల్ రోడ్డుతో అవస్థలు

ఇరుకుగా రావిర్యాల సర్దార్‌నగర్ రహదారి

- ఇబ్బందులు పడుతున్న ప్రయాణికులు
- పట్టించుకోని అధికారులు



అధ్వానంగా మారిన రావిర్యాల సర్దార్‌నగర్ రోడ్డు

తుక్కుగూడ: మున్సిపాలిటీ పరిధిలోని రావిర్యాల నుంచి సర్దార్‌నగర్ పోయే రోడ్డు అధ్వానంగా మారింది. గత కొనేళ్ల నుంచి మరమ్మతులు చేయక పోవడంతో గుంతలుగా మారింది. అసలే సింగల్ రోడ్డు అందులో గుంతలు ఉండటంతో వాహనదారులు ప్రయాణం చేయడానికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ రోడ్డుగుండా నిత్యం తుక్కుగూడ, సర్దార్‌నగర్ నుంచి రావిర్యాలకు వాహనదారలు, రైతులు ఇలా వందలాంది మంది ప్రయాణం చేస్తున్నారు. దీనికి తోడు ఇక్కడ ప్రముఖ అమ్మవారి దేవాలయమైన శ్రీ సూర్యగిరి ఎల్లమ్మ ఆలయం కలదు. ఇక్కడికి ప్రతి మంగళవారం అమ్మవారి దర్శనార్థం వందలాంది మంది భక్తులు వస్తుంటారు. రావిర్యాల పెద్ద చెరువు నీరు కూడా రోడ్డు మీదికి రావడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు.

శిథిలావస్థలో బ్రిడ్జి..

ఈ రోడ్డులో పులిందర్ వాగుపై ఉన్న బ్రిడ్జి పూర్తిగా శిథిలావస్థకు చేరుకుంది. గత వర్షాకాలంలో వరద నీరు బ్రిడ్జిపై నుంచి రావడంతో కొన్ని నెలల పాటు వాహనాల రాకపోకలు పూర్తిగా నిలిపి వేశారు. అధికారులు స్పందించి సింగల్ రోడ్డును డబుల్ రోడ్డుగా మార్చడంతో పాటు, పులిందర్ వాగుపై నూతన బ్రిడ్జిని ఏర్పాటు చేసి వాహనదారుల కష్టాలను తీర్చాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

రోడ్డు విస్తరణ చేపట్టాలి

రావిర్యాల నుంచి సర్దార్‌నగర్, తుక్కుగూడ గ్రామాలకు పోయే రోడ్డు అధ్వానంగా తయారైంది. ఈ రహదారి నుంచి నిత్యం వందలాది వాహనదారులు ప్రయాణం చేస్తున్నారు. అధికారులు స్పందించి రోడ్డు విస్తరణ పనులు చేపట్టాలి

– తాళ్ల అశోక్‌గౌడ్ సర్దార్‌నగర్



సర్టిఫికెట్లతో విద్యార్థులు

ముగిసిన యోగా శిక్షణ తరగతులు

హుడాకాంప్లెక్స్: గురు నిలయం ఆధ్వర్యంలో నిర్వహించిన బాలల వ్యక్తిత్వ వికాస యోగా శిక్షణా తరగతులు చివరి రోజు కార్యక్రమాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి లోటస్ ల్యాప్ పబ్లిక్ స్కూల్ డైరెక్టర్ కడారి చంద్రశేఖర్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై వేసవి శిక్షణా తరగతులు పూర్తి చేసుకున్న విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. యోగా సాధన పిల్లల్లో మనో నియంత్రణ, మానసిక ఒత్తిడిని అధిమించి ప్రశాంతమైన జీవితాన్ని గడపడానికి ఎంతో ఉపయోగపడుతుందన్నారు. యోగా గురువు ఇస్మాయిల్ గురుజీ మాట్లాడుతూ.. భారతీయ ఆధ్యాత్మిక విలువలు మనిషిని నైతికంగా, శారీరకంగా అభివృద్ధిలోకి తీసుకొస్తాయని, ప్రతి విద్యార్థి యోగా సాధన ద్వారా తమ జీవితాలను ఉత్తమంగా, ఉన్నతంగా మార్చుకోవాలని తెలియజేశారు. అదే విధంగా విద్యార్థులు తల్లిదండ్రులకు పాదపూజ చేశారు.

నకిలీ విత్తనాలు అమ్మితే చర్యలు



షాబాద్‌లోని ఫర్టిలైజర్ దుకాణంలో తనిఖీలు నిర్వహిస్తున్న అధికారులు

షాబాద్: ఫర్టిలైజర్ దుకాణాల్లో నకిలీ విత్తనాలు అమ్మితే కఠిన చర్యలు తప్పవని, ప్రభుత్వ అనుమతులు ఉన్న ఎరువులు, విత్తనాలనే విక్రయించాలని షాబాద్ మండల వ్యవసాయశాఖ అధికారి వెంకటేశం పేర్కొన్నారు. శనివారం మండల కేంద్రంలో ఫర్టిలైజర్ దుకాణాలను డిప్యూటీ తహసీల్దార్ మధు, ఎస్ఐ మహేశ్వర్‌రెడ్డిలతో కలిసి తనిఖీలు నిర్వహించారు. షాపుల్లోని స్టాకు నిల్వలను, స్టాకు రిజిస్టర్‌లను, బిల్లు పుస్తకాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులకు విత్తనాల కొరత రాకుండా తగినన్నీ నిల్వలు పెట్టాలని, ఎమ్మార్పీ కంటే అధిక ధరలకు అమ్మితే ఆ డీలర్స్‌పై తగు చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా నాణ్యమైన విత్తనాలు, ఎరువులు మాత్రమే విక్రయించాలని సూచించారు. ఎరువులు, విత్తనాలు కొనుగోలు చేసిన దుకాణాల్లో తప్పనిసరిగా రసీదు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్ఐ మహేశ్వర్‌రెడ్డి తదితరులున్నారు.

మొయినాబాద్: మొయినాబాద్‌లోని మూడు ఫర్టిలైజర్ దుకాణాల్లో శనివారం మండల వ్యవసాయాధికారి రాగమ్మ, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ చంద్రమోహన్ సంయుక్తంగా తనిఖీలు నిర్వహించారు. పత్తి, ఇతర విత్తనాలు, ఎరువులు అందుబాటులో ఉన్నాయా అనే విషయాలను తెలుసుకున్నారు. రికార్డులు, బిల్లులను పరిశీలించారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయాధికారి రాగమ్మ మాట్లాడుతూ.. రైతులకు అవసరమైన అన్ని రకాల విత్తనాలు, ఎరువులను డీలర్లు అందుబాటులో ఉంచాలన్నారు. లూజు విత్తనాలు విక్రయించొవద్దని, విత్తనాలు, ఎరువులు కొనుగోలు చేసిన రైతులకు బిల్లులు తప్పనిసరిగా ఇవ్వాలన్నారు. రైతులు లైసెన్సు ఉన్న డీలర్ల వద్దనే ఎరువులు, విత్తనాలు కొనుగోలు చేయాలని సూచించారు. వానాకాలం పంటకు సంబంధించిన విత్తనాలు, ఎరువులు అందుబాటులో ఉన్నాయన్నారు.

పాఠశాలల అభివృద్ధికి కృషి చేద్దాం

ఎంపీడీఓ సంధ్య



సమావేశంలో మాట్లాడుతున్న సంధ్య

మొయినాబాద్‌రూరల్: అమ్మ ఆదర్శ పాఠశాల అభివృద్ధిలో అందరం భాగస్వాములమై పాఠశాలల బలోపేతానికి కృషి చేద్దామని మండల అభివృద్ధి అధికారి సంధ్య పేర్కొన్నారు. శనివారం మొయినాబాద్ మండల పరిషత్ కార్యాలయంలో మండలంలోని అన్ని శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర విద్యాశాఖకు అనుగుణంగా అమ్మ ఆదర్శ పాఠశాల అభివృద్ధిలో భాగంగా బడి బాట, ఏకరూప దుస్తులు కుట్టడం, రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవాలకు సంబంధించిన వాటిపై చర్చించారు. జూన్ 12న పాఠశాలలు పునఃప్రారంభం కానుండడంతో విద్యార్థులకు దుస్తులు, ఉచిత భోజనం, పాఠ్య పుస్తకాలు, నోట్‌బుక్స్ అందజేస్తామన్నారు. ఇందుకు గ్రామాల్లో ఉన్న ప్రభుత్వ పాఠశాలలు విద్యార్థులతో కళకళలాడే విధంగా ఉండేలా ఉపాధ్యాయులు కృషి చేయాల్సిన అవసరం ఉందని తెలిపారు. అదే విధంగా జిల్లా కలెక్టర్ ఆదేశాలనుసారం పాఠశాలల్లో చిన్న చిన్న మరమ్మతులు, గదుల్లో రంగులు వేయడం, గ్రీన్ బ్లాక్ బోర్డు ఏర్పాటు చేయడం, ప్రహరీ మరమ్మతులు వంటి అభివృద్ధి పనులకు ప్రభుత్వం ద్వారా లక్ష రూపాయలు అందించిందన్నారు. జిల్లాలో 1360 స్కూళ్లను మొదటి విడతలో ఎంపిక చేశారని అందులో మొయినాబాద్ మండలంలో మొదటి విడత 19 పాఠశాలలు ఉన్నాయన్నారు. మండలంలో మొత్తం 51 పాఠశాలల్లో 19 పాఠశాలలను తీసుకున్నారని పేర్కొన్నారు. ఎంపిక చేసిన పాఠశాలల్లో మరమ్మతులకు లక్ష రూపాయలకు అదనంగా అయ్యే ఖర్చు ఉంటే రివైజ్ ఇస్టిమెంట్ చేసి పంపిస్తే అధికంగా లక్షకు పైగా వచ్చే అవకాశం ఉందన్నారు.

3 నుంచి 17 వరకు బడి బాట

ఈ విద్యా సంవత్సరం పునఃప్రారంభం కానుండడంతో గ్రామాల్లోని ఆయా పాఠశాలల ద్వారా అన్ని శాఖల అధికారులు బడి బాటను నిర్వహించాలని పేర్కొన్నారు. ఈ బడిబాట రేపు 3వ తేదీ సోమవారం నుంచి ప్రారంభమై 17వ తేదీ వరకు నిర్వహించాలని సూచించారు. పాఠశాలలు పునఃప్రారంభం కానున్న నేపథ్యంలో విద్యార్థులకు కావాల్సిన యూనిఫాం, భోజనం, పుస్తకాలు అన్ని ముందుగానే సమకూర్చుకొని పంపించాలని తెలిపారు. ఎలాంటి లోటు, అవకతవకలు ఉన్నా వెంటనే తమకు సమాచారం ఇవ్వాలని పేర్కొన్నారు. సమావేశంలో మండల విద్యాధికారి వెంకటయ్య, మండల సెక్టోరియల్ అధికారి జావిద్ అహ్మద్, మండల డిప్యూటీ తహసీల్దార్ వినోద్, మండల ఎంపీవో వెంకటేశ్వర్‌రెడ్డి, ఎస్సై నర్సింహులు పాల్గొన్నారు.

నేడు రాష్ట్ర అవతరణ వేడుకలు

మహేశ్వరం: మండల కేంద్రంలో మండల పరిషత్ కార్యాలయంలో ఆదివారం ఉదయం 8:45 గంటలకు ఇన్‌చార్జి ఎంపీపీ సునీతా అంధ్యా నాయక్ అధ్యక్షతన తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలు నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ శైలజ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి ఎంపీటీసీ సభ్యులు, అధికారులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు.

కూన నర్సమ్మకు ఘన నివాళి



మాజీ సర్పంచ్ కూన యాదయ్యను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే సబితారెడ్డి

మహేశ్వరం: మహేశ్వరం మాజీ సర్పంచ్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు కూన యాదయ్య తల్లి కూన నర్సమ్మ మృతి చెందారు. శనివారం మహేశ్వరం ఎమ్మెల్యే సబితారెడ్డి, కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి పలువురు ఆమె భౌతికాయానికి నివాళులర్పించారు. కూన యాదయ్యను ఓదార్చి పరామర్శించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, మాజీ ఎంపీపీ కోరుపోలు రఘుమారెడ్డి, మండల మాజీ అధ్యక్షుడు కాకి ఈశ్వర్ ముదిరాజ్, శివగంగ ఆలయ చైర్మన్ అల్లె కుమార్, వత్తుల రఘుపతి, బీఆర్ఎస్ నాయకులు హన్మగళ్ల చంద్రయ్య, శివగంగ ఆలయ కమిటీ మాజీ చైర్మన్ నిమ్మగూడెం సుధీర్ గౌడ్, అంబయ్య యాదవ్ పాల్గొన్నారు.



కందుకూరు: ఫర్టిలైజర్ దుకాణంలో స్టాక్ నిల్వలను పరిశీలిస్తున్న ఏసీపీ, తదితరులు

ఫర్టిలైజర్ దుకాణాల్లో తనిఖీలు

కందుకూరు: మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల్లో శనివారం ఫర్టిలైజర్, సీడ్ దుకాణాల్లో పోలీస్, రెవెన్యూ, వ్యవసాయ అధికారులు సంయుక్తంగా తనిఖీలు చేపట్టారు. మహేశ్వరం ఏసీపీ లక్ష్మీకాంత్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆయా శాఖల అధికారులు షాపుల్లో తనిఖీలు నిర్వహించారు. ఆయా షాపుల్లో ఉన్న ఎరువులు, విత్తనాల నిల్వపై ఆరా తీశారు. రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ.. నకిలీ విత్తనాలు, ఎరువుల విక్రయాలు చేపడితే క్రిమినల్ చర్యలు తప్పవని హెచ్చరించారు. రైతులు తప్పకుండా షాపుల నుంచి రసీదు తీసుకొని భద్రపరచుకోవాలన్నారు. గ్రామాలకు వచ్చి విడిగా విత్తనాలు విక్రయించే వారిపై దృష్టి పెట్టాలని సూచించారు. నకిలీలపై ఉక్కుపాదం మోపేలా అందరూ సహకరించాలని కోరారు. కార్యక్రమంలో సీఐ మక్బూల్‌జానీ, నాయబ్ తహసీల్దార్ తాజుద్దీన్, ఏఓ లావణ్య, ఎస్ఐ సైదులు తదితరులు పాల్గొన్నారు.

బాలల కథల సంపుటి పుస్తకావిష్కరణ



బాలల కథల సంపుటి పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న కార్పొరేటర్ సునీత

బడంగ్‌పేట్: కార్పొరేషన్ పరిధిలోని నాదర్‌గుల్‌కు చెందిన ప్రముఖ బాల సాహితీవేత్త పైడిమర్రి రామకృష్ణ తాజా బాలల కథల సంపుటి నాదర్‌గుల్ పేరుతో కథలు రచించారు. శనివారం స్థానిక 9వ డివిజన్ కార్పొరేటర్ నిమ్మల సునీతశ్రీకాంత్‌గౌడ్ చేతుల మీదుగా కథల పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ కథల సంపుటిలో మొత్తం 32 కథలు ఉన్నట్లు రచయిత రామకృష్ణ వెల్లడించారు. ఇందులోని కథలన్నీ నాదర్‌గుల్ చుట్టుపక్కల ప్రాంతాల్లో జరిగినట్లు రాసినన్నారు. ఇవి మంచి సందేశాన్ని, బాలలకు నీతిని, సందేశాన్ని తెలిపేలా ఉన్నాయని తెలిపారు. బాలల కథల సంపుటిని నిమ్మల సునీత శ్రీకాంత్ దంపతులకు అంకితమిస్తున్నట్లు రామకృష్ణ వెల్లడించారు. కార్యక్రమంలో భాగ్యనగర్ బ్యాంక్ డైరెక్టర్ తోట ప్రతాప్‌రెడ్డి, కృష్ణ, అమరేందర్‌రెడ్డి, అరవింద్‌రెడ్డి, మహేందర్‌యాదవ్, నిమ్మల రవికాంత్‌గౌడ్, జ్ఞానేశ్వర్, శ్రీధర్, యాతం వెంకటేశ్, నర్సింగ్‌యాదవ్ తదితరులు ఉన్నారు.

నోటీసులు జారీ చేశాం

సాక్షి ఎఫెక్ట్..

తుక్కుగూడ: ఈ నెల 31న సాక్షి దినపత్రికలో వచ్చిన 'యథేచ్ఛంగా ఫిరంగి వాగు కబ్జా' అనే కథనానికి ఇరిగేషన్ శాఖ అధికారులు స్పందించారు. శనివారం వాగులో నిర్మిస్తున్న కట్టడాలను వారు పరిశీలించారు. ఈ సందర్భంగా ఏఈ గోవింద్ మాట్లాడుతూ.. ఫిరంగి వాగులో బఫర్ జోన్‌లో ప్రహరీ నిర్మిస్తున్నట్లు గుర్తించామన్నారు. శాఖపరమైన చర్యలు తీసుకోవడానికి నిర్మాణదారులకు నోటీసులు జారీ చేశామన్నారు. కార్యక్రమంలో సిబ్బంది మహిపాల్, తదితరులు ఉన్నారు.

ఘనంగా హనుమాన్ జయంతి



మహేశ్వరం: లక్ష తమలపాకులతో అర్చన చేసిన భక్తులు



ర్యాలీలో పాల్గొన్న భక్తులు

మహేశ్వరం: మండల పరిధిలోని ఘట్టుపల్లి గ్రామంలో స్వయంభూగా వెలసిన వీరాంజనేయ స్వామి ఆలయంలో హనుమాన్ జయంతి వేడుకలు ఘనంగా భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఉదయం 5గంటలకు సుప్రభాతం, పంచామృతాభిషేకం, 7 గంటలకు నాగవల్లి పూజ (లక్ష తమలపాకులతో స్వామివారికి అర్చన), మన్యూసూక్త హోమం, మధ్యాహ్నం ఒంటి గంటకు హారతి, అన్నప్రసాద వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ట్రస్టీలు కోరుపోలు రఘుమారెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, ఈఓ శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పహాడీషరీఫ్‌లో..

పహాడీషరీఫ్: మామిడిపల్లి పరిసర గ్రామాలు జై శ్రీరామ్ నినాదాలతో మారుమ్రోగాయి. శ్రీ పంచముఖి హనుమాన్ వ్యాయామ శాల కమిటీ ఆధ్వర్యంలో మామిడిపల్లిలోని దాసాంజనేయ స్వామి దేవాలయం నుంచి ప్రారంభమైన శ్రీ హనుమాన్ హిందూ శక్తి ఐక్యత యాత్ర (మహా బైక్ ర్యాలీ) మామిడిపల్లి, జల్‌పల్లి, శ్రీరాం కాలనీ, పహాడీషరీఫ్, రంగ నాయకుల కాలనీ, దేవేందర్ నగర్‌ల మీదుగా తిరిగి మామిడిపల్లికి చేరుకుంది. మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే కేఎల్ఆర్, బడంగ్‌పేట్ మేయర్ చిగిరింత పారిజాత నర్సింహా రెడ్డి, బీజేపీ నేతలు అందెల శ్రీరాములు యాదవ్, తూళ్ల వీరేందర్ గౌడ్‌లు దర్శించుకొని పూజలు నిర్వహించారు. మహేశ్వరం అదనపు డీసీపీ సత్యనారాయణ, ఏసీపీ లక్ష్మీకాంత రెడ్డి, పహాడీషరీఫ్ ఇన్‌స్పెక్టర్ గురువారెడ్డిల పర్యవేక్షణలో గట్టి బందోబస్తును ఏర్పాటు చేశారు.

మీర్‌పేట: మీర్‌పేట కార్పొరేషన్ 28వ డివిజన్‌లోని పంచముఖి ఆంజనేయస్వామి దేవాలయంలో జరిగిన హనుమాన్ జయంతి వేడుకలకు బీజేపీ చేవెళ్ల అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. పూజల్లో బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి అందెల శ్రీరాములుయాదవ్, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కొలన్ శంకర్‌రెడ్డి, మీర్‌పేట పార్టీ అధ్యక్షుడు పెండ్యాల నర్సింహ, కార్పొరేటర్ జిల్లెల అరుణ తదితరులు పాల్గొన్నారు.



దాసాంజనేయ స్వామి ఆలయాన్ని దర్శించుకున్న కొండా విశ్వేశ్వర్ రెడ్డి



మీర్‌పేట: పంచముఖి ఆంజనేయ స్వామి ఆలయంలో పూజలో నాయకులు